# దేవుడూ - సైతానూ

ఒకనాటి నిశిరాత్రి వేళ సైతాను దేవుడింటికి వచ్చి మెల్లిగా తలుపు తట్టాడు. దేవుడు తలుపు తీసి సగౌరవంగా సైతానును లోపలికి తీసుకుపోయినాడు.

ఈ విషయం మన క్రైస్తవ సోదరులకూ, మహమ్మదీయ సోదరులకూ వింతగా కనిపించవచ్చు. కాని నిజం. అసలు, దేవుడికీ సైతానుకూ ప్రబల శత్రుత్వం ఉందనే అభిప్రాయం వట్టి మోసం - పెద్ద దగా. ఇది రుజువు చెయ్యటానికి ప్రబలమైన ఆధారాలున్నై.

దేవుడూ సైతాను లాంటి మహాశక్తులు నిజంగా పరస్పర వైరం గలవే అయితే ఏదో ఒకటి రెండోదాన్ని ఎప్పుడో ధ్వంసం చేసి ఉండేది; లేదా, రెండూ ధ్వంసమై ఉండేవి. అనంతమైన కాలంలో మంచిని చెడో, చెడును మంచో జయించలేకపోవటంలో ఏదో కిటుకుండి తీరాలి.

కనీసం, సైతానుకూ దేవుడికీ తలపడ్డట్టు కూడా ఎక్కడా సాక్ష్యం లేదు. లూసిఫరు దేవతల్లో ఒకడై ఉన్న కాలంలో అతనికీ దేవుడికీ బ్రహ్మాండమైన ఘర్షణ జరగటమూ, లూసిఫరు ఓడిపోయి పతితుడై సైతానుగా నరకాధిపత్యం వహించటమూ బైబిల్లో చెప్పి ఉంది. సైతానుకూ దేవుడికీ ఎన్నడూ ఘర్షణ జరగలేదు.

అసలు యదార్థమేమిటో బైబిలే చెబుతున్నది. సైతానూ, దేవుడూ ఏకమై ఆదామునూ, అవ్వనూ, వారి సంతతి మానవకోటినీ పతితుల్ని చేసేశారు. సైతానుకూ దేవుడికీ విరోధమేమిటి? మధ్య మానవుడు నలిగి చావటమేమిటి?

భగవద్గీతలో కూడా ఈ రహస్యం స్పష్టమవుతూనే ఉంది : "నువు నిమిత్త మాత్రుడివి. వీళ్ళంతా ఇదివరకే నాచేత చంపబడ్డ వాళ్లు" అని కోతలు కోసిన కృష్ణుడు, అన్నిటికీ తానే కారకుడనేది మరిచిపోయి, "ధర్మానికి కీడూ, అధర్మానికి మేలూ కలిగినప్పుడల్లా శిష్టులను రక్షించి దుష్టులను ఖండించటానికి అవతరిస్తాడు" అన్నాడు - ధర్మానికి కిడూ, అధర్మానికి మేలూ తన అనుమతి లేకుండా కలుగుతున్నట్టు! సర్వసమర్థుడైన తాను ఒక్కసారిగా అధర్మాన్ని నిర్మూలించరాదూ? ఆహా! ఆ పేరు పెట్టి మనుషుల్నే నిర్మూలించాలి!

మరొక రహస్యం : నిజంగా దేవుడూ సైతానూ విరోధులే అయి, దేవుడు సైతానునే జయిస్తే, ప్రపంచంలో దేవుణ్ని ఖాతరు చేసేదెవరు? అధికారవాంఛగల పాలకవర్గం ఎక్కడైనా ప్రజలకు ఆదర్శప్రాయమైన పరిపాలనా విధానం ఇస్తుందా?

ఇంకో రహస్యం : మానవ చరిత్రలో జరిగిన సంఘర్షణలు తీసి చూసినట్టయితే, ఏ యుద్ధంలో కూడా ఫలాని పక్షాన దేవుడూ, రెండో పక్షాన సైతానూ ఉండినట్టు రుజువుకాదు. ఇద్దరూ రెండు పక్షాలా ఉన్నట్టు కనబడుతుంది. దీన్ని బట్టి ఏమనుకోవాలి?... ఒకవేళ ఏ యుద్ధంలోనన్నా ఒక పక్షాన ధర్మమూ, రెండో పక్షాన అధర్మమూ ఉన్నట్టు రుజువయినా, అటువంటి యుద్ధాల్లో ధర్మమే గెలిచిందని రుజువు చెయ్యటానికి అసలే లేదు.

ఇదంతా పరమ దగా!

నిజం ఏమిటంటే, దేవుడూ సైతానూ ప్రబల విరోధులల్లేనూ, ప్రతిపక్షులల్లేనూ నటించి, మనుషుల్లో విభజనలు తెచ్చిపెట్టి, జయప్రదంగా ప్రపంచాన్ని ఏలుతున్నారు.

వాళ్ళిద్దరికీ ఎటువంటి విరోధమూ లేకపోగా బోలెడంత పరస్పరాకర్షణా, అనురాగమూ ఉన్నది. తాను చెయ్యలేని పనులు చేస్తాడని దేవుడికి సైతానును చూస్తే ప్రేమతో కూడిన అసూయ. జీవితంలో ఉన్న ఆనందానికి దూరుడై నిగ్రహంతో జీవిస్తున్నందుకు దేవుడి మీద సైతానుకు ప్రేమతో కూడిన జాలి.

❀ ❀ ❀ ❀ ❀

"భాయీ, ఏమిటి విశేషాలు?" అన్నాడు దేవుడు.

"ఇదంతా నాకేమీ బాగాలేదు. మనం చాలా అజాగర్తగా ఉంటున్నాం," అన్నాడు సైతాను.

"ఏమిటేమిటి?" అన్నాడు దేవుడు.

"నువ్వేమీ పట్టించుకోవటం లేదు. ప్రపంచంలో నాస్తికత్వం ఎట్లా విజృంభిస్తున్నదీ చూశావా?" అన్నాడు సైతాను.

"ఇది మనకు కొత్తా! మంచిదే. ఆ నాస్తికుల పక్షాన నువ్వు పనిచెయ్యి!" అన్నాడు దేవుడు.

సైతాను నాస్తికత్వం గురించి విచారించటమూ, దేవుడు విచారించకపోవటమూ అజ్ఞానుల కాశ్చర్యం కలిగించవచ్చు. కాని మనకు నిజం తెలుసు గనుక ఆశ్చర్యం లేదు.

"ఈ నాస్తికత్వం చాలా కొత్తగా ఉంది. వీళ్లు నిన్నూ నన్నూ కూడా తృణీకరిస్తున్నారు."

"ఎవరు వాళ్లు?"

"వీళ్లు ముఖ్యంగా రెండు రకాలుగా ఉన్నారు. ఒక రకం వాళ్లు శాస్త్రజ్ఞులు, రెండో రకం వాళ్లు సామ్యవాదులు. వీళ్లతో చెడ్డ చిక్కుగా ఉంది. వీళ్లు చెరోవేపు నించీ భౌతికవాదం అంటూ ఒకటి బయల్దేరదీశారు. తమకు కలిగే కష్టసుఖాలకు మనుష్యులు నన్నూ నిన్నూ

జవాబుదారీ చేసినంతకాలము మనపని దర్జాగా వెళ్లిపోయింది. ఆ రోజుల్లో ఏ విపత్తు కలిగినా అది ఎవరో ఒకరి పాపం వల్ల కలిగిందని నమ్మారు. ఒకరినొకరు అనుమానంతో చూసుకున్నారు. వెలివేసుకున్నారు. దండించుకున్నారు. వాళ్లు నీ పేరా నా పేరా కొట్టుకుచావటంలో మన ప్రభ అద్వితీయంగా వెలిగిపోయింది. ఇప్పుడట్లా కాదు. వీళ్లు తమ కష్ట సుఖాలు తమ చేతిలోనే ఉన్నయనీ, సరియయిన ఆర్థిక వ్యవస్థ వల్ల మనను స్మరించకుండా జీవించవచ్చుననీ తెలుసుకున్నారు" అన్నాడు సైతాను.

దేవుడాలోచించాడు.

"మనమీద మనుషులకు గల ఆదరం కొద్దీ వాళ్లలో మొదట్లో సంఘీభావం ఏర్పడింది. అందుచేత మనమూ సంఘీభావాన్ని ప్రోత్సహించాం. చివరకదే ఈనాటికి ఇట్లా పరిణమించినట్టు నాకు తోస్తున్నది" అన్నాడు దేవుడు.

"నేనప్పుడే అన్నాను. ఈ పరిస్థితి కలగవలిసింది. కాని నువు దేవుడల్లే అడ్డుపడి వాళ్లకు మతమంటూ ఇచ్చావు. నువూ నేనూ వేరు వేరనే జ్ఞానం ఇచ్చావు. ఆ మతం ద్వారా అజ్ఞానం స్థిరంగా ఉండే ఏర్పాటు చేశావు. కాని చివరకు మనుషులు మేలుకొనే మేలుకున్నారు" అన్నాడు సైతాను.

"అదే వచ్చిన చిక్కు. సంఘీభావం క్రమంగా మతాన్ని వెనక్కు తోస్తూ వస్తున్నది. క్రమంగా మనుషులు మన ప్రమేయం లేకుండా సొంత సంస్థలు – ఆస్పత్రులూ, న్యాయస్థానాలూ, మొదలైనవి – ఏర్పాటు చేసుకుని ఎంత కష్టంలో కూడా మనమీద ఆధారపడటమూ మనకు మొక్కటమూ మానేశారు. ఆమాట అని మనుషుల్లో సంఘీభావం కలిగించినట్లయితే ఇంతకాలమూ పొట్టలచల్ల కదలకుండా కూచుని ఇంత కీర్తి సంపాదించగలిగేవాళ్లమా?" అన్నాడు దేవుడు.

సైతాను గడిచిన రోజులు తలుచుకుని బిగ్గిరిగా నవ్వుతూ, "ఏమీ చెయ్యకుండా – చిటికెనవేలయినా కదల్చకుండా – మనుషుల నోళ్లల్లో ఎంతగా నానేం! ఎన్ని తిట్లూ దీవనలూ తిన్నాం! మనను స్మరించకుండా వాళ్లకొక్కరోజు గడిచిందా? మన ప్రస్తావన లేకుండా ఒక్క పుస్తకం రాయగలిగారా? ఇప్పటికీ –" అని అకస్మాత్తుగా నవ్వటం ఆపి "కాని మన ముందు గతేమిటి? వెనక మతం కల్పించినట్టే మళ్లీ ఇంకో దివ్యమైన ఆలోచన చెయ్యలేవుగా" అన్నాడు.

దేవుడు నవ్వాడు.

"నీకెందుకింత భయం?" అన్నాడు దేవుడు. "ఇప్పటికీ ఇంకా మనమీద భ్రాంతి వదలనివాళ్లు కోటానుకోట్లున్నారు. నీకు తెలీని దేముంది గనకా? నాలో విశ్వాసం ఉన్న ప్రతివాడికీ నువ్వు వెయ్యిమంది మనుషుల బలం ఇవ్వు. నీ దయవల్ల మూఢత్వానికున్న

బలం విజ్ఞానానికీ లేదు; అబద్ధానికున్న ప్రచారం నిజానికి లేదు. కొండ ఎక్కటంకంటె కొండ మీది నించి కిందపడటం సులభం చేసినవాడివి, నీ కెందుకీ అనుమానం. మనుషులకు పనికొచ్చే విశ్వాసాల మీద కంటె పనికిరాని విశ్వాసాల మీద ఎక్కువ మక్కువ ఉన్నంతకాలమూ, మనస్తత్వాల మానవులు సాటి మానవులను తప్పు పట్టినంతవరకూ మనకేమీ భయం లేదు. ఈ శాస్త్రజ్ఞులూ, భౌతికవాదులూ ఎప్పటికైనా పరిపాలించగలరనా నీ ఉద్దేశం? సామ్యవాదాన్ని ప్రతిఘటించటానికి తారతమ్యవాదం ఉన్నది. భౌతికవాదాన్ని ప్రతిఘటించటానికి ఆధ్యాత్మికవాదం బోలెడన్ని రకాలుగా ఉన్నది. నేనున్న చోటినల్లా నువు ఉన్నావు. నాపేర మనుష్య లెకమైనంతకాలమూ నీ సంతృప్తికేననుకో... ప్రపంచంలో ఉన్న మనుషులంతా ఏకమయ్యే రోజు వస్తే అప్పుడు నేనూ ఉండను, నువూ ఉండవు. కాని ఆ రోజిప్పుడప్పుడే రాదులే!"

***ముద్రణ : చిత్రగుప్త, 15 డిసెంబర్ 1942***